క్లుప్తంగా

ఇంటి దగ్గరే ఈ-కేవైసీ

లింగంపేట: భారత్ గ్యాస్ వినియోగదారులు ఇబ్బందులు పడకుండా వినియోగదారుల ఇంటి వద్దకు వెళ్లి ఈ కేవైసీ చేయిస్తున్నట్లు లింగంపేటలోని గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు తెలిపారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు గ్రామాల వారీగా వినియోగదారుల ఇళ్లకు వెళ్లి ఆధార్ కార్డు, గ్యాస్ ఖాతా నంబరుతో ఈ కేవైసీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు ఆందోళన చెందవద్దన్నారు. ఇప్పటికే 15 గ్రామాలకు చెందిన వినియోగదారుల ఈకేవైసీ పూర్తిచేసినట్లు నిర్వాహకుడు అంజద్ హుస్సేన్ తెలిపారు.

చిన్నారులకు వ్యాక్సిన్లు

ఎల్లారెడ్డిరూరల్ : ఎల్లారెడ్డి మండలం మల్లయ్యపల్లిలో శనివారం చిన్నారులకు వ్యాక్సిన్లు వేశారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు బాలింతలకు వ్యాక్సిన్ల పట్ల అవగాహన కల్పించారు.

ఉపాధ్యాయులకు సన్మానం



తాడ్వాయి : బదిలీపై వెళ్తున్న మండలంలోని కృష్ణాజివాడి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు వేణుగోపాల్, రమేష్, రాజేందర్, రవీందర్‌లను శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. ఎంఈవో రామస్వామి, సర్పంచ్ భూషణం, ఉప సర్పంచ్ తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

షబ్బీర్ అలీని కలిసిన బంజారా నాయకులు



కామారెడ్డి టౌన్ : మాజీ మంత్రి షబ్బీర్ అలీని హైదరాబాద్‌లో శనివారం కామారెడ్డి బంజారా నాయకులు కలిశారు. పుష్పగుచ్చం అందజేసి సత్కరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం షబ్బీర్ అలీకి మంత్రి పదవి ఇవ్వాలని వారు ఆకాంక్షించారు. అలాగే సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డిని కలిసి సన్మానించారు. బంజారా నాయకులు కేతావత్ మోతిసింగ్, నేనావత్ మోతీరాం, రాణా ప్రతాప్ రాథోడ్, రాజు నాయక్, వినోద్ నాయక్, సత్తిపండు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం



భిక్కనూరు : మండలంలోని జంగంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం బాలసభ శనివారం నిర్వహించారు. ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు పాటలు, పద్యాలు, కథలపై పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల హెచ్ఎం రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు విజయ నిర్మల, లింబాద్రి, గఫూర్ శిక్షక్, కిషన్, రాజు, తబిత, సత్యనారాయణ, రాజ్యలక్ష్మి, ప్రవీణ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



భిక్కనూరు: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు భిక్కనూరు ఎస్సై సాయికుమార్ శనివారం తెలిపారు. కామారెడ్డి వైపు నుంచి జంగంపల్లి వైపు వస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేశామన్నారు. ట్రాక్టర్‌ను భిక్కనూరు పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు.

నేడు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నిజాంసాగర్: మండలంలోని అచ్చంపేటలో గల జవహర్ నవోదయ విద్యాలయంలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు పూర్వ విద్యార్థుల సంఘం ఉపాధ్యక్షుడు నాగవేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు నవోదయ విద్యాలయంలో చదువుకున్న 32 బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులు హాజరవుతున్నారని పేర్కొన్నారు. నవోదయ ప్రిన్సిపాల్ సత్యవతి ఆధ్వర్యంలో సమ్మేళనం జరుగుతుందన్నారు.

విశ్వకర్మ యోజనను సద్వినియోగం చేసుకోవాలి

రుద్రూర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని చేతి వృత్తుల వారు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ ఓబీసీ జిల్లా కార్యదర్శి సుధాకర్‌గౌడ్ కోరారు. మండల కేంద్రంలో శనివారం ఆయన మాట్లాడారు. ఈ పథకం ద్వారా నైపుణ్య శిక్షణతోపాటు శిక్షణ కాలంలో రోజుకు రూ.500 చొప్పున స్టైఫండ్ ఇస్తారన్నారు.

విద్యార్థినుల ఆరోగ్యంపై నిర్లక్ష్యమేలా?

- నిలిచిపోయిన హైజిన్ కిట్ల పంపిణీ
- నెలల తరబడి అందని కాస్మోటిక్ చార్జీలు
- ఇబ్బందులు పడుతున్న బాలికలు



నాగిరెడ్డిపేట కస్తూర్బా పాఠశాల



కస్తూర్బా పాఠశాలలో వ్యాయామం చేస్తున్న విద్యార్థినులు

నాగిరెడ్డిపేట : కస్తూర్బా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినుల ఆరోగ్యంపై నిర్లక్ష్యపు నీడలు అలుముకున్నాయి. విద్యార్థినులకు అందిచాల్సిన హైజిన్ కిట్లను సరఫరా చేయకపోగా వాటి స్థానంలో ఇస్తామన్న నగదును కూడా అందించడం లేదు. దీంతో కస్తూర్బా విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోని 19 కస్తూర్బా పాఠశాలల్లో సుమారు ఐదు వేల మంది విద్యార్థినులు చదువుతున్నారు. కరోనాకు ముందు కస్తూర్బా పాఠశాలల్లో విద్యార్థినులకు మూడు నెలలకోకసారి హైజిన్ కిట్లను అందజేసేవారు. ఇందులో 16రకాల వస్తువులు ఉండేవి. బట్టల సబ్బులు, స్నానపు సబ్బులతోపాటు రిబ్బన్లు, కొబ్బరినూనె, దువ్వెనలు, పౌడర్ తదితర వస్తువులు ఇచ్చేవారు. విద్యార్థినులకు ఇవి చాలా ఉపయోగపడేవి. కరోనా తర్వాత విద్యార్థినులకు హైజిన్‌కిట్ల సరఫరాను అప్పటి ప్రభుత్వం నిలిపివేసింది.

ఖాతాలు తెరిచినా..

హైజిన్ కిట్లకు బదులుగా ఒక్కో విద్యార్థినికి ప్రతి నెలా రూ.100చొప్పున నగదును అందజేస్తామని ప్రకటించారు. ఈ మేరకు కస్తూర్బా పాఠశాలల్లోని విద్యార్థినులు బ్యాంకుల్లో ప్రత్యేకంగా ఖాతాలు తెరిచారు. అధికారులు వాటిని ఆన్‌లైన్ సైతం చేశారు. కానీ ఇప్పటి వరకు విద్యార్థినులకు ఒక్క నెలా కూడా నగదు జమ కాలేదు. దీంతో విద్యార్థినులు కొబ్బరినూనె, సబ్బులు కొనుగోలు చేసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కస్తూర్బా పాఠశాలల విద్యార్థినుల కాస్మోటిక్ కష్టాలను తీర్చాలని వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

బడ్జెట్ లేకపోవడంతో విడుదల కాలేదు

కరోనాకు ముందు విద్యార్థినులకు హైజిన్‌కిట్లను అందించారు. కరోనా తర్వాత కిట్ల సరఫరా నిలిచిపోయింది. ఈ యేడు హైజిన్ కిట్లకు బదులు నగదును అందిస్తామన్నారు. తగినంత బడ్జెట్ లేకపోవడంతో విద్యార్థినులకు కాస్మోటిక్ చార్జీలు విడుదల కాలేదు. ప్రభుత్వం నుంచి నేరుగా విద్యార్థినుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు. – వీణ, కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపాల్, నాగిరెడ్డిపేట

కేంద్ర పథకాలపై ప్రదర్శన



ప్రదర్శనను తిలకిస్తున్న నాయకులు, గ్రామస్తులు

సదాశివనగర్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించేందుకు చేపట్టిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర శుక్రవారం మండల కేంద్రానికి చేరుకుంది. పథకాల అమలు తీరును స్క్రీన్‌పై ప్రదర్శన నిర్వహించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాణాల లక్ష్మారెడ్డి, మురళీధర్ గౌడ్, సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు బుడిగె నర్సింహారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, మోహన్‌రాజ్, సంకరి విఠల్, సాయిలు, గంగారెడ్డి, రాజమౌళి పాల్గొన్నారు.

ముసుగు తీయరూ!

కామారెడ్డి టౌన్ : కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి పక్కన ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి వేసిన ముసుగును ఇంకా తొలగించలేదు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో విగ్రహాలకు ముసుగులు వేశారు. కోడ్ ముగిసి 10 రోజులు దాటిన ఇంకా వైఎస్ విగ్రహానికి ముసుగు తొలగించకపోవడంతో ఆయన అభిమానులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని వైఎస్సార్‌టీపీ రాష్ట్ర నాయకుడు నీలం రమేష్ పేర్కొన్నారు.



'ఎఫ్‌ఎల్‌ఎన్'ను పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న డీఈవో రాజు

రాజంపేట : పాఠశాలల్లో ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా విద్యాధికారి రాజు అన్నారు. శనివారం రాజంపేట మండలంలోని శివాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. తల్లిదండ్రులు పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. విద్యాశాఖ ద్వారా పాఠశాలలలో నిర్వహిస్తున్న తొలిమెట్టు (ఎఫ్‌ఎల్‌ఎన్) కార్యక్రమం ప్రాధాన్యతను వివరించారు. ప్రతి నెల మూడో శనివారం నిర్వహించే తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశానికి క్రమం తప్పకుండా హాజరు కావాలని సూచించారు. అనంతరం పాఠశాల రికార్డులను పరిశీలించారు. ఎంఈవో రామస్వామి, జిల్లా సెక్టోరియల్ అధికారి శ్రీపతి, సర్పంచ్ విఠల్‌రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ బాలరాజు, హెచ్ఎం స్వామి పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై శ్రద్ధ చూపాలి



ఆర్గొండలో నర్సరీని పరిశీలిస్తున్న అధికారులు



దేవాయిపల్లి నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో

రాజంపేట : మొక్కల పెంపకం ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపీడీవో బాలకృష్ణ అన్నారు. శనివారం రాజంపేట మండలం ఆర్గొండ గ్రామ పరిధిలోని నర్సరీని ఆయన పరిశీలించారు. మొక్కలకు ప్రతిరోజు నీరు అందించాలని, అదే విధంగా నర్సరీ చుట్టు కంచె ఏర్పాటు చేయాలని సూచించారు. ఎంపీవో రఘురాం, ఫీల్డ్ అసిస్టెంటు పాల్గొన్నారు.

తాడ్వాయి : మండలంలోని దేవాయిపల్లి శివారులో ఉన్న నర్సరీని శనివారం ఎంపీడీవో రాజ్ వీర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడ ఖాళీ స్థలం ఉంటే అక్కడ మొక్కలను నాటాలన్నారు. నర్సరిలో ఉన్న మొక్కలకు ప్రతి రోజు నీరు పోసి సంరక్షించా లన్నారు. గ్రామంలో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించాలన్నారు.

కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు మృతి



మద్నూర్ : కాంగ్రెస్ పార్టీ యూత్ మండలాధ్యక్షుడు తమ్మెవార్ భగవాన్(46) శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. భగవాన్ మృతితో మద్నూర్ మార్కెట్ బంద్ పాటించారు. అంత్యక్రియలకు కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

ర్యాగింగ్ చేస్తే చర్యలు



భిక్కనూరు : సీనియర్ విద్యార్థులు జూనియర్లను ర్యాగింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌గౌడ్ అన్నారు. శనివారం తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన విద్యార్థుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీనియర్లు క్యాంపస్‌లో చేరే జూనియర్ విద్యార్థులకు మార్గదర్శకంగా ఉంటూ సహాయ సహకారాలను అందజేయాలన్నారు.


ఏటీఎం కార్డు అందజేత

దోమకొండ : దోమకొండలోని ఎస్‌బీఐ ఏటీఎం వద్ద మండల కేంద్రానికి చెందిన బ్రహ్మయ్యగారి సౌమ్య శనివారం డబ్బులు విత్‌డ్రా చేసుకుని ఏటీఎం కార్డును మర్చిపోయింది. అదే సమయంలో ఏటీఎం వద్దకు వచ్చిన గొట్టిముక్కల గ్రామానికి చెందిన శివశంకర్ అనే ఏటీఎంతో పాటు మరో కార్డును గుర్తించి పోలీస్ స్టేషన్‌లో అందజేశారు. వాటిని వాట్సప్‌లో పెట్టగా బాధితురాలు గుర్తించారు. దీంతో సౌమ్య తమ్ముడుకి కార్డులను అందజేసినట్లు ఎస్సై మురళి తెలిపారు.

పుస్తెమట్టెల వితరణ

కామారెడ్డి టౌన్ : మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లికి చెందిన పేద వధువుకు మున్నూరు కాపు సంఘం జిల్లా నాయకుడు కొమిరెడ్డి నారాయణ పుస్తె, మట్టెలను శనివారం వితరణ చేశారు. పేద కుటుంబమైన దూమాల పద్మ- మల్లేష్ దంపతుల కూతురు మాధురి వివాహానికి తనవంతుగా సహాయం చేశారు. కౌన్సిలర్ ఉర్దొండ వనిత, కాంగ్రెస్ నాయకులు నీలం వెంకటి, వీడీసీ అధ్యక్షుడు స్వామి ఉన్నారు.

ఎరువులను అందుబాటులో ఉంచాలి



నాగిరెడ్డిపేట : యాసంగి పంటల సాగు కోసం సొసైటీ పరిధిలోని రైతులకు ఎరువులను అందుబాటులో ఉంచాలని మండలంలోని తాండూర్ సొసైటీ డైరెక్టర్లు చైర్మన్‌ను కోరారు. మండలంలోని తాండూర్ సొసైటీ కార్యాలయంలో శనివారం చైర్మన్ గంగారెడ్డి అధ్యక్షతన డైరెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ వానాకాలం సీజన్‌లో రైతుల నుంచి 1,61,171 క్వింటాళ్ల ధాన్యం సేకరించామని తెలిపారు. వైస్ చైర్మన్ బాబురావు, సీఈవో జైపాల్‌రెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఘనంగా పడిపూజ



ఎల్లారెడ్డి రూరల్ : ఎల్లారెడ్డిలో అయ్యప్ప పడిపూజ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని హరిబాబు స్వామి సన్నిధిలో పడి పూజ చేశారు. అనంతరం స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. గురుస్వాములు చంద్రం, నాగేష్, శ్రీనివాస్ ఉన్నారు.

సేంద్రియ ఎరువులతో లాభాలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న రిలయన్స్ ఫౌండేషన్ మేనేజర్ వీరేశం

నిజాంసాగర్ : రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకంపై రైతులు దృష్టి సారించాలని రిలయన్స్ ఫౌండేషన్ జిల్లా మేనేజర్ వీరేశం సూచించారు. శనివారం మహమ్మద్‌నగర్ మండలంలోని సింగితం, దూప్‌సింగ్, గిర్నితండా గ్రామ పంచాయతీల్లో యాసంగి పంటల సాగుపై రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. పీఎస్సీ, నానోయూరియా, డీఏపీ వాడకం ద్వారా పంటలకు మేలు చేస్తాయని వివరించారు. పంట సాగుకు ముందుగా భూసార పరీక్షలు చేయించాలని సూచించారు.

మండల వ్యవసాయశాఖ అధికారి అమర్‌ప్రసాద్, సర్పంచులు ర్యాల లావణ్యశ్రీధర్‌రెడ్డి, చందర్ రాథోడ్, అనిత, ఎంపీటీసీ అంకిత, రిలయన్స్ ప్రతినిధులు శిల్ప, ప్రసాద్ పాల్గొన్నారు.

ఆస్పత్రి అభ్యున్నతికి కృషి



ఆస్పత్రిలో సమీక్షిస్తున్న ఎంపీపీ పట్లోళ్ల జ్యోతి

నిజాంసాగర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి అభ్యున్నతికి కృషి చేస్తామని ఆస్పత్రి కమిటీ చైర్ పర్సన్, ఎంపీపీ పట్లోళ్ల జ్యోతి అన్నారు. శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆస్పత్రి కమిటీ సమావేశం నిర్వహించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మౌలిక వసతులతో పాటు తాగునీటి సదుపాయం కల్పించాలన్నారు.

కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మనోహర్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు రమేష్‌గౌడ్, ఆరోగ్య కేంద్రం వైద్యుడు రోహిత్, ఫార్మసిస్టు అనిత తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో వసతులు కరువు



బాన్సువాడలోని భవిత కేంద్రం

బాన్సువాడ రూరల్ : దివ్యాంగ విద్యార్థులకు విద్య అందించాలని ప్రతి మండల కేంద్రంలో ప్రభుత్వం భవిత కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ కేంద్రంలో శారీరక, మానసిక దివ్యాంగులకు ఫిజియో థెరపీతో పాటు విద్యాభ్యాసం చేయిస్తారు. అయితే బాన్సువాడలోని భవిత కేంద్రంలో వసతులు కరువయ్యాయి. కేంద్రం పక్కనే నాసిరకంగా టాయిలెట్లు నిర్మించిన కాంట్రాక్టర్ కనీసం వాటికి తలుపులు అమర్చలేదు. నీటి సౌకర్యం కల్పించడలేదు. దీంతో టాయిలెట్లు పూర్తి శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ప్రత్యేక అవసరాలు కల్గిన విద్యార్థులు, వారి వెంట వచ్చే తల్లిదండ్రులు కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. మండల పరిషత్ కార్యాలయం, రెవెన్యూ డివిజన్ కార్యాలయాల ఆవరణలోనే ఉన్న ఈ భవిత కేంద్రం గురించి అధికారులు పట్టించుకుని వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు



ఎమ్మెల్యే కేవీఆర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

భిక్కనూరు : కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డిని మండలంలోని జంగంపల్లి బీజేపీ నేతలు శనివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కేవీఆర్‌కు పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. అత్తెల్లి తిరుమలేష్, పరమేశ్వర్, ప్రవీణ్‌గౌడ్, నాగభూషణం, రాము పాల్గొన్నారు.



ఘనంగా ప్రీ క్రిస్మస్ వేడుకలు

సదాశివనగర్ : మండలంలోని మర్కల్ స్టేజీ వద్ద గల మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో శనివారం ప్రీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ రాధిక, సీనియర్ అధ్యాపకుడు వెంకటేశ్వర్ రావు, వైస్ ప్రిన్సిపాల్ రేణుక, కల్చరల్ కో ఆర్డినేటర్ ఆర్ ఉదయిని పాల్గొన్నారు.

బడి బయట పిల్లల గుర్తింపు



తడ్కపల్లిలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఆర్పీ



తిమ్మారెడ్డిలో..

మాచారెడ్డి: బడి బయట పిల్లలను గుర్తించడానికి ఈ నెల 11నుంచి జనవరి 10 వరకు విద్యాశాఖ చేపట్టిన సర్వే శనివారం కొనసాగింది. ఈ సందర్భంగా సీఆర్పీ దేవసంజీవ్ మాట్లాడుతూ.. 5 నుంచి 14 ఏళ్ల పిల్లలు బడిలోనే ఉండాలన్నారు. తడ్కపల్లిలో ఇద్దరు బడి బయట పిల్లలను గుర్తించి కౌన్సెలింగ్ నిర్వహించారు. బడీడు పిల్లలతో పని చేయిస్తే నేరమని చెప్పారు.

ఎల్లారెడ్డిరూరల్ : ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మారెడ్డిలో బడిబయట బాలుడిని గుర్తించినట్లు సీఆర్పీ మహిపాల్ శనివారం తెలిపారు. బాలుడిని సమీపంలోని పాఠశాలలో చేర్పించామన్నారు.

కొనసాగుతున్న చెరుకు క్రషింగ్

సదాశివనగర్ : మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గాయత్రి షుగర్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతోంది. శుక్రవారం నాటికి 84,200టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు.



వానరాలతో వాహనదారులకు ఇబ్బందులు

బీబీపేటతో పాటు ఆయా గ్రామాల్లో కోతులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బీబీపేట ప్రధాన రహదారిపై కోతులు ఉండటంతో వాహనాదారులు ఆ మార్గంలో వెళ్లడానికి జంకుతున్నారు. కోతుల బెడద అరికట్టాలని కోరుతున్నారు. – బీబీపేట

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కామారెడ్డి & ఎల్లారెడ్డి
96034 62494
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
బాన్సువాడ: యం. మధుసూధన్ : 9951027699
ఎల్లారెడ్డి: డి. యల్. ఎన్. గౌడ్ : 6300453108
కామారెడ్డి : కె. రాజు : 9949699861
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899